భెల్ డైరెక్టర్‌గా బాని వర్మ

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: ప్రభుత్వ రంగ సంస్థ భెల్ డైరెక్టర్‌గా బాని వర్మ నియమితులయ్యారు. గతంలో భెల్ రవాణా వ్యాపారంతోపాటు ఎలక్ట్రానిక్స్ డివిజన్ యూనిట్‌ను నిర్వహించినట్టు కంపెనీ పేర్కొంది. ఢిల్లీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేసిన వర్మ..1990లో భెల్‌లో తన కెరియర్‌ను ప్రారంభించారు. ఎనర్జీ, ఇండస్ట్రీ, రవాణా విభాగాల్లో 33 ఏండ్ల అనుభవం కలిగివున్నారు.

సేలం టూ హైదరాబాద్ ఇండిగో ఫ్లైట్

చెన్నై, అక్టోబర్ 10: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ఈ నెల చివర్లో తమిళనాడులోని సేలం నుంచి పలు నూతన రూట్లకు విమాన సర్వీసులు ప్రారంభించబోతున్నది. ఈ నెల 29 నుంచి సేలం నుంచి చెన్నైకి, ఈ నెల 30 నుంచి సేలం నుంచి హైదరాబాద్, బెంగళూరు రూట్లలో విమాన సర్వీసులు ఆరంభిస్తున్నట్టు తెలిపింది. దీంతో దేశీయంగా అందిస్తున్న 82వ రూటు ఇది కాగా, అంతర్జాతీయంగా 114 రూట్ ఇదని పేర్కొంది. సేలం నుంచి మూడు రూట్లకు విమాన సేవలు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉన్నదని ఇండిగో హెడ్ వినయ్ మల్హోత్రా తెలిపారు.

9.57 లక్షల కోట్లకు పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: ప్రత్యక్ష పన్ను వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో అంచనావేసిన దాంట్లో 52.5 శాతం వసూలయ్యాయి. ఈ నెల 9 నాటికి రూ.9.57 లక్షల కోట్లు ప్రత్యక్ష పన్ను వసూలైనట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. క్రితం ఏడాది వసూలైన దాంతో పోలిస్తే 21.82 శాతం అధికం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.18.23 లక్షల కోట్ల మేర ప్రత్యక్ష పన్ను వసూలుకానున్నట్టు కేంద్రం అంచనావేసిన విషయం తెలిసిందే. అలాగే స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 17.95 శాతం ఎగబాకి రూ.11.07 లక్షల కోట్లకు చేరుకున్నాయి. కార్పొరేట్ ఆదాయ పన్ను, వ్యక్తిగత ఆదాయ పన్ను కలుపుకొని స్థూల ఆదాయం వసూలు కానున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ 9 వరకు రూ.1.50 లక్షల రీఫండ్ చెల్లింపులు జరిపినట్టు తెలిపింది.

పెరిగిన పసిడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. ఢిల్లీలో తులం బంగారం ధర రూ.250 పెరిగి రూ.58,600 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పెరగడం వల్లనే దేశీయంగా అధికమయ్యాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. అంతకుముందు బంగారం రూ.58,350గా ఉన్నది. మరోవైపు, వెండి రూ.100 పెరిగి రూ.72,600కి ఎగబాకింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 1,858 డాలర్లకు చేరుకోగా, వెండి 21.75 డాలర్ల వద్ద కొనుగుతున్నది.

కేపబుల్ హైదరాబాద్

జీసీసీల్లో బెంగళూరు కంటే ముందంజ
నగరానికి క్యూ కడుతున్న గ్లోబల్ కంపెనీలు
కొత్తగా ఈ జనవరి-జూన్‌లో 23 రాక
విస్తరణ దశలో మరో నాలుగు
ఎవరెస్ట్ గ్రూప్ నివేదికలో వెల్లడి



వ్యాపార కేంద్రాలను ప్రారంభించడానికి భారత్‌కు వచ్చే బహుళజాతి సంస్థలకు బెంగళూరే గమ్యస్థానం.

అయితే ఇది ఒకప్పుడు.. ఇప్పుడు ఆ స్థానాన్ని హైదరాబాద్ భర్తీ చేసింది. ప్రస్తుతం అంతర్జాతీయ కంపెనీలకు అసలు సిసిలైన చిరునామా హైదరాబాదే మరి.

ఈ ఏడాది మొదలు రాష్ట్ర రాజధాని నగరానికి వచ్చిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్యే ఇందుకు నిదర్శనం. దాదాపు బెంగళూరుకు రెట్టింపు స్థాయిలో జీసీసీలు హైదరాబాద్‌కు వరుస కట్టాయి. ఇప్పటికే ఉన్న వాటి విస్తరణలోనూ హైదరాబాద్‌దే పైచేయి.

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): గ్లోబల్ కేపబులిటీ సెంటర్ (జీసీసీ)ల స్థాపన, విస్తరణలో హైదరాబాద్ నగరం దూసుకుపోతున్నది. ఈ క్రమంలో భారతీయ సిలికాన్ వ్యాలీగా పేరుగాంచిన బెంగళూరును సైతం దాటేసింది. ఏండ్ల తరబడి బహుళజాతి కంపెనీల చూపును కట్టిపడేసిన బెంగళూరు.. ప్రస్తుతం హైదరాబాద్ ముంగిట నిలువలేకపోతున్నది. ఇప్పుడు దేశంలోని జీసీసీల్లో సుమారు సగం బెంగళూరులోనే ఉన్నాయన్నది ఎంత నిజమో.. ఇకపై కొత్తగా ఏర్పాటు కాబోతున్నవి హైదరాబాద్‌లోనేనన్నది అంతే నిజం. అవును.. జీసీసీ నిర్వాహక సంస్థలు తెలంగాణ రాజధానికి క్యూ కడుతున్నాయి మరి. కొత్తవాటి ఏర్పాటులోనైనా.. ఇప్పటికే ఉన్నవాటి విస్తరణలోనైనా.. హైదరాబాద్ దూకుడును ప్రదర్శిస్తున్నదిప్పుడు. విస్తరణ అంటూ వినపడితే హైదరాబాదే తమ తొలి ఎంపికని దేశ, విదేశీ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి.

అక్కడ 13.. ఇక్కడ 23

ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో బెంగళూరు 13 జీసీసీలను ఆకర్షిస్తే.. హైదరాబాద్ 23 జీసీసీలను ఆకట్టుకున్నదని అంతర్జాతీయ రిసెర్చ్ సంస్థ ఎవరెస్ట్ గ్రూప్ తాజా నివేదిక తేల్చింది. కొత్త వాటిలోనే కాదు.. విస్తరణలోనూ హైదరాబాద్ ముందే ఉన్నది. బెంగళూరులో ఇప్పటికే ఉన్న జీసీసీల్లో మూడు విస్తరణ పనుల్లో ఉన్నాయి. అయితే హైదరాబాద్‌లోని జీసీసీల్లో నాలుగు విస్తరణ బాట పట్టాయి. నిజానికి బెంగళూరులో ఇక అభివృద్ధికి ఆస్కారం లేదని, కానీ హైదరాబాద్‌లో అందుకు పుష్కలమైన అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. భారీ పెట్టుబడులతో హైదరాబాద్ అంతకంతకూ పెరుగుతూ పోతున్నదని గుర్తుచేస్తున్నాయి.

గొప్ప ప్రత్యామ్నాయం

మౌలిక సదుపాయాలపరంగా హైదరాబాద్ బాగుంటుందని, ఇదే అంతర్జాతీయ కంపెనీలను తమ జీసీసీల ఏర్పాటుకు నగరాన్ని ఎంచుకునేలా ప్రేరేపిస్తున్నదని ఏఎన్ఎస్ఆర్ కన్సల్టింగ్ సీఈవో లలిత్ అహూజా తెలిపారు. వాస్తవానికి ఐటీ, ఫార్మా రంగాలతోపాటు ఏవియేషన్, రియల్టీ రంగాలకు హైదరాబాద్ ఇప్పటికే పేరుగాంచింది. అయితే ఇప్పుడు జీసీసీ సెంటర్ల ఏర్పాటుకూ హైదరాబాదే ప్రధాన కేంద్రంగా ఆవిర్భవిస్తున్నదని అహూజా అన్నారు. బయోటెక్, టెక్నాలజీ, ఆర్థిక సేవలతోపాటు ఆటో రంగంలో వృద్ధి ఇందుకు దోహదం చేస్తున్నదని చెప్పారు. ఎవరెస్ట్ గ్రూప్ సైతం ఏరోస్పేస్, తయారీ, రిటైల్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్స్, ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగాల్లోని ఫార్చ్యూన్ 500 కంపెనీలు.. హైదరాబాద్‌పట్ల ఆసక్తి చూపిస్తున్నట్టు పేర్కొన్నది.

టీ-హబ్, జీనోమ్ వ్యాలీ..

రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో అభివృద్ధి చేసిన టీ-హబ్, జీనోమ్ వ్యాలీ.. జీసీసీల ఏర్పాటుకు కలిసొస్తున్నాయని పలువురు విశ్లేషకులు అంటున్నారు. తెలంగాణ ప్రభుత్వ అనుకూల, స్నేహపూర్వక విధానాలు, ముఖ్యం గా మంత్రి కేటీఆర్ కార్పొరేట్ దిగ్గజాలతో జరుపుతున్న సమావేశాలు.. ఈ వృద్ధికి దోహదం చేస్తున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా మాండీ హోల్డింగ్స్, స్టోరబుల్, రైట్ సాఫ్ట్‌వేర్, టెక్జెన్స్, జాప్‌కామ్, చార్లెస్ స్క్వాబ్ కార్పొరేషన్ తదితర ప్రపంచ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో కొత్త కేంద్రాల ఏర్పాటు, ఉన్న కేంద్రాల విస్తరణ ప్రణాళికలను ప్రకటించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ప్రథమార్ధంలో 40కిపైగా అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్‌లో తమ యాక్సిలరేషన్ సెంటర్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, ఇన్నోవేషన్ కేంద్రాలు, ఆర్ అండ్‌డీలను ఏర్పాటు చేసినట్టు ఎవరెస్ట్ గ్రూప్ వివరించింది. కొత్త జీసీసీల స్థాపన, విస్తరణతో హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు గణనీయంగా పెరిగాయని, 2021-22లో దేశంలోని మొత్తం ఐటీ ఉద్యోగాల్లో హైదరాబాద్ వాటా 33 శాతం నుంచి 44 శాతానికి పెరిగిందన్నది. అదే సమయంలో వివిధ రంగాలకు సంబంధించి నగరంలో పెట్టుబడులు గణనీయంగా రావడం వల్ల ఐటీయేతర ఉద్యోగాల సంఖ్య కూడా పెరిగినట్టు ఎవరెస్ట్ తెలిపింది.

హైదరాబాద్‌లో చాలా పెద్ద టెక్ కమ్యూనిటీ ఉన్నది. ఎన్నో భారీ టెక్ ప్రొడక్ట్ కంపెనీలకు నగరం నిలయం. ఇక్కడ నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి సంస్థలున్నాయి. దీంతో కొత్తవారు ఇట్టే ఆకర్షితులవుతున్నారు. పైగా నగర విస్తరణకు అనుకూలంగా చుట్టూ ఖాళీ స్థలాలు ఉండటం హైదరాబాద్‌కు సువర్ణావకాశం గానే చెప్పాలి.

-లలిత్ అహూజా, ఏఎన్ఎస్ఆర్ కన్సల్టింగ్ సీఈవో

బెంగళూరుకు ఇప్పుడు హైదరాబాద్, పుణె నగరాలు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి. ఇందులో హైదరాబాద్‌కే కంపెనీలు మొగ్గుతున్నాయి. ప్రతిభ, నైపుణ్యం కలిగిన యువతతోపాటు చక్కని మౌలిక వసతులు, అనువైన వ్యాపార పరిస్థితులు, దేనికైనా ఖర్చు తక్కువగా ఉండటం ఇక్కడికొచ్చే సంస్థలకు కలిసొస్తున్నది.

-అరిందమ్ సేన్, ఈవై ఇండియా పార్ట్‌నర్

హైదరాబాద్‌కున్న అనుకూలతలు..

- అంతర్జాతీయంగా పేరున్న ఐఎస్‌బీ, ఐఐఐటీ, బిట్స్ పిలానీ వంటి సంస్థలు
- నైపుణ్యం-ప్రతిభగల యువత, సిబ్బందిని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వ చేయూత
- ఐటీ, ఫార్మా రంగానికి ప్రసిద్ధి చెందినప్పటికీ ఇటీవలికాలంలో వేగంగా విస్తరిస్తున్న అనేక ఇతర రంగాలు
- ఏరోస్పేస్, తయారీ, రిటైల్ సేవలు, ప్రొఫెషనల్ సర్వీసెస్ ఇండస్ట్రీలతో జీసీసీలకు డిమాండ్
- గోల్డ్‌మన్ శాక్స్ ఇటీవలి విస్తరణతో గ్లోబల్ మార్కెట్‌లో మరింత పెరిగిన హైదరాబాద్ ప్రతిష్ఠ
- ఫెడ్‌ఎక్స్ తమ సప్లై చైన్‌ను విస్తరించడంతోపాటు ఆవిష్కరణ కేంద్రం ఏర్పాటుతో నూతనోత్సాహం
- లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ సైబర్ భద్రత సేవలను విస్తరిస్తున్నది. అపోలో టైర్స్, డీఏజెడ్ఎన్, ఆక్యూజెన్, పై స్క్వేర్, వార్నర్ బ్రోస్ డిస్కవరీ తదితర కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా విస్తరణ
- యానిమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషీన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ వంటి భవిష్యత్తు టెక్నాలజీకి సంబంధించిన అనేక కంపెనీలు హైదరాబాద్ నుంచి తమ సేవలను అందిస్తున్నాయి
- రాష్ట్ర ప్రభుత్వ సహకారం, అందుబాటులో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు
- వరదలు, ప్రకృతి విపత్తులకు ఆస్కారంలేని అనువైన వాతావరణం

హైదరాబాద్‌లో మ్యాక్సివిజన్ నూతన ఐ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

500 కోట్లతో మ్యాక్సివిజన్ విస్తరణ

తెలంగాణలో 12, ఏపీల్లో 18 దవాఖానల ఏర్పాటు

హైదరాబాద్, అక్టోబర్ 10: ప్రముఖ కంటి ఆసుపత్రుల నిర్వహణ సంస్థ మ్యాక్సివిజన్.. హైదరాబాద్‌లో సూపర్ టెర్టరీ ఐ కేర్ సెంటర్‌ను ప్రారంభించింది. 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.20 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఈ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న ఆరోగ్యశ్రీ, ఉద్యోగశ్రీ కార్డు కలిగిన వారికి చికిత్స చేయనున్నారు. ఈ సందర్భంగా మ్యాక్సివిజన్ గ్రూపు సీఈవో వీఎస్ సుధీర్ మాట్లాడుతూ..ప్రస్తుతం మెట్రో నగరాలకు పరిమితమైన ఆసుపత్రులను ఇక నుంచి ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించనున్నట్టు, ఇందుకోసం వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో రూ.1,400 కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్టు ప్రకటించారు. వీటిలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో రూ.500 కోట్లతో విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో 28 ఉండగా, వచ్చే మూడేండ్లలో కొత్తగా 12 ఆసుపత్రులను ఏర్పాటు చేయనుండగా..అలాగే ఏపీలో ప్రస్తుతం ఆరు ఉండగా, వీటి సంఖ్యను 30కి పెంచుకోనున్నట్లు చెప్పారు. తెలుగు రాష్ర్టాల్లో ద్వితీయ శ్రేణి నగరాలకు తన వ్యాపారాన్ని విస్తరించడంలో భాగంగా సిద్దిపేట, కరీంగనర్, నిజామాబాద్, వరంగల్‌తోపాటు ఇతర చిన్న నగరాల్లో సైతం హాస్పిటల్స్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపారు.

కొత్తగా 1,500 ఉద్యోగాలు

కొత్తగా ఆసుపత్రులను నిర్మిస్తుండటంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే 1200 మంది ఉద్యోగులు, 200 మంది డాక్టర్లు ఉండగా, కొత్తగా ఏర్పాటు చేయనున్న దవాఖానల కోసం 1,000-1,500 మంది సిబ్బందిని, 150 డాక్టర్లను రిక్రూట్ చేసుకోనున్నది. అలాగే వచ్చే నెలలో తార్నాక, మణికొండ, అత్తాపూర్‌లలో కూడా కంటి దవాఖానాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు.

టీసీఎల్ నయా వాషింగ్ మిషన్లు

హైదరాబాద్ అసెంబ్లింగ్ యూనిట్‌లో ఉత్పత్తి

హైదరాబాద్, అక్టోబర్ 10: టీవీలు, గృహోపకరణాల తయారీలో అంతర్జాతీయ సంస్థ టీసీఎల్..దేశీయ మార్కెట్లోకి పూర్తిస్థాయి ఆటోమేటిక్ వాషింగ్ మిషన్‌ను విడుదల చేసింది. హైదరాబాద్‌లోని అసెంబ్లింగ్ ప్లాంట్లో తయారైన ఈ వాషింగ్ మిషన్‌ను కంపెనీ సీఈవో ఫిలిప్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తక్కువ ధరకే కొత్తదనం కోరుకుంటున్న కస్టమర్లకు ఈ నూతన శ్రేణి వాషింగ్ మిషన్లను అందిస్తున్నట్టు చెప్పారు. ఈ వాషింగ్ మిషన్లు 7 కిలోలు, 9.5 కిలోల శ్రేణిలో లభించనున్నాయి. ఈ మిషన్లు హైదరాబాద్‌లోని ఈ-సిటీ వద్ద ఉన్న రిసోజెట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఉన్న యూనిట్‌లో ఏటా 6 లక్షల ఉత్పత్తి అవుతున్నాయి.

బీవోబీ యాప్‌పై ఆర్బీఐ ఆంక్షలు

కొత్త కస్టమర్లను చేర్చుకోరాదంటూ ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా మొబైల్ యాప్ 'బీవోబీ వరల్డ్'లోకి కొత్త కస్టమర్లను చేర్చుకోరాదంటూ రిజర్వ్‌బ్యాంక్ నియంత్రణ విధించింది. పర్యవేక్షణా ఆందోళనల ఉన్నందున ఈ యాప్ విధించిన ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని మంగళవారం ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అప్లికేషన్‌లో ఖాతాదారుల్ని చేర్చుకునేతీరులో కొన్ని పర్యవేక్షణా లోపాల్ని కనుగొన్నట్లు వెల్లడించింది. ఆర్బీఐ సంతృప్తిమేరకు బ్యాంక్ ఈ లోపాల్ని సరి చేసి, ప్రక్రియను పటిష్ఠపర్చడానికి లోబడి తదుపరి కస్టమర్లను చేర్చుకోవడాన్ని అనుమతిస్తామని వివరించింది. తాజా సస్పెన్షన్ కారణంగా 'బీవోబీ వరల్డ్' ప్రస్తుత కస్టమర్లకు ఎటువంటి అంతరాయం ఉండబోదని ఆర్బీఐ తెలిపింది.

దిద్దుబాటు చర్యలు చేపట్టాం: బీవోబీ

రిజర్వ్‌బ్యాంక్ లేవనెత్తిన ఆందోళనల పరిష్కారానికి ఇప్పటికే తాము దిద్దుబాటు చర్యలు చేపట్టామని, మిగిలిన వ్యత్యాల్ని పూడ్చేందుకు మరిన్ని చర్యలు మొదలుపెట్టామని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. కేంద్ర బ్యాంక్ సంతృప్తిమేరకు ఆర్బీఐ అధికారులతో కలిసి పనిచేస్తున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో బీవోబీ పేర్కొంది. తమ కస్టమర్లకు ఎటువంటి అడ్డంకి ఏర్పడదని, మొబైల్ యాప్‌పై నిరంతర సేవల్ని అందుకోవచ్చని బ్యాంక్ హామీ ఇచ్చింది. ఆర్బీఐ తాజా ఉత్తర్వులతో తమ ప్రస్తుత కస్టమర్లు, కొత్త ఖాతాదారులకు తమ ఇతర డిజిటల్ బ్యాంకింగ్ ఛానళ్లయిన నెట్ బ్యాంకింగ్, వాట్సాప్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్స్, ఏటీఎం తదితరాలు యథాతథంగా కొనసాగుతాయని వివరించింది. అలాగే తమ మొత్తం వ్యాపార, వృద్ధి ప్రణాళికలపై ఆర్బీఐ చర్యల ప్రభావం ఉండబోదని తెలిపింది.

అదానీ డౌన్.. అంబానీ అప్



రూ.8.08 లక్షల కోట్ల సంపదతో మళ్లీ దేశీయ ధనికుల్లో ముకేశ్ అగ్రస్థానం • హురున్ శ్రీమంతుల జాబితా విడుదల

- తాజా హురున్ జాబితాలో దేశంలోని 138 నగరాలకు చెందిన 1,319 మంది సంపన్నులకు చోటు
- వీరందరి సంపద విలువ రూ.109 లక్షల కోట్లు. ఒక్కొక్కరి సంపద విలువ రూ.1,000 కోట్లపైనే
- ఈ ఏడాది ఆగస్టు 30దాకా ఉన్న సంపదను లెక్కించి లిస్టు తయారీ
- గతంతో పోల్చితే పెరిగిన 216 మంది. ఈసారి కొత్తగా వచ్చినవారు 278 మంది
- గడిచిన ఏడాది కాలంలో ప్రతీ మూడు వారాలకు ఇద్దరేసి బిలియనీర్లు పెరుగుదల
- ప్రస్తుతం దేశంలో 259 మంది డాలర్ బిలియనీర్లు. ఏడాది క్రిందట 38 మందే
- అత్యధికంగా ముంబై నగరంలో 328 మంది బిలియనీర్లు. తర్వాతి స్థానాల్లో ఢిల్లీ (199), బెంగళూరు (100)
- దేశీయ సంపన్నుల్లో అత్యధిక మంది ఔషధ రంగ పరిశ్రమకు చెందినవారే

హురున్ టాప్-10 భారతీయ శ్రీమంతులు

ర్యాంక్ పేరు	సంపద (రూపాయల్లో)
2. గౌతమ్ అదానీ	4.74 లక్షల కోట్లు
3. సైరస్ పూనవాలా	2.78 లక్షల కోట్లు
4. శివ్ నాడార్	2.28 లక్షల కోట్లు
5. గోపీచంద్ హిందూజా	1.76 లక్షల కోట్లు
6. దిలీప్ సంఘ్వీ	1.64 లక్షల కోట్లు
7. లక్ష్మీ మిట్టల్	1.62 లక్షల కోట్లు
8. రాధాకిషన్ దమానీ	1.43 లక్షల కోట్లు
9. కుమార్ బిర్లా	1.25 లక్షల కోట్లు
10. నీరజ్ బజాజ్	1.20 లక్షల కోట్లు

ముంబై, అక్టోబర్ 10: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ మళ్లీ భారతీయ అపర కుబేరుడిగా అవతరించారు. తాజాగా విడుదలైన 360 వన్ వెల్త్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2023 ప్రకారం ముకేశ్ సంపద రూ.8.08 లక్షల కోట్లుగా ఉన్నది. ఇదే సమయంలో గౌతమ్ అదానీ ఆస్తులు రూ.4.74 లక్షల కోట్లుగానే ఉన్నట్టు తేలింది. దీంతో మరోసారి దేశీయ ధనికుల్లో అగ్రస్థానం ముకేశ్‌కే దక్కింది. క్రిందటిసారి గౌతమ్ అదానీ టాప్‌లో ఉండగా, గడిచిన ఏడాది కాలంలో ఈయన సంపద ఏకంగా 57 శాతం కరిగిపోయినట్టు హురున్ పేర్కొన్నది. ఫలితంగానే ముకేశ్ అంబానీ మళ్లీ టాప్‌లోకి వచ్చినట్టు స్పష్టం చేసింది. నిజానికి ఈ ఏడాది కాలంలో ముకేశ్ సంపద పెరిగింది కేవలం 2 శాతమే. ఇక జాబితాలోని ధనికులందరి సంపద విలువ.. సింగపూర్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాల ఉమ్మడి జీడీపీ కన్నా ఎక్కువగానే ఉండటం గమనార్హం.

హిండెన్‌బర్గ్ దెబ్బ

అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ రిపోర్టుతో అదానీ గ్రూప్ సంపద భారీ ఎత్తున ఆవిరైపోయిన విషయం తెలిసిందే. ఈ కారణంగానే అదానీ.. భారతీయ శ్రీమంతుల్లో ఇప్పుడు రెండో స్థానానికి పరిమితం కావాల్సి వచ్చిందని హురున్ ఎండీ, చీఫ్ రిసెర్చర్ అనాస్ రహ్మాన్ జునైద్ చెప్పారు. అదానీ గ్రూప్ అక్రమాలకు పాల్పడిందని, అందుకే స్టాక్ మార్కెట్లలో అదానీ కంపెనీల షేర్లు అంతలా పెరిగాయని ఈ ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ సంచలన ఆరోపణలు చేసిన సంగతి విదితమే. దీంతో మార్కెట్లలో గ్రూప్ షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

దమానీ వెనుకంజ

సంపద సృష్టిలో ప్రముఖ రిటైల్ స్టోర్ డీమార్ట్ అధిపతి రాధాకిషన్ దమానీ వెనుకబడ్డారు. గడిచిన ఏడాది కాలంలో దమానీ సంపద 18 శాతం క్షీణించినట్టు తాజా రిపోర్టులో తేలింది. ఈ క్రమంలోనే టాప్-10 సంపన్నుల్లో 3 ర్యాంకులను చేజార్చుకుని ఈసారి 8వ స్థానంలో స్థిరపడాల్సి వచ్చింది. ఇదిలావుంటే దేశంలో అసమానతలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ ఈసారి 51 మంది శ్రీమంతుల సంపద రెట్టింపైనట్టు హురున్ వెల్లడించింది. నిరుడు వీరి సంఖ్య 24గానే ఉన్నది. జాబితాలో జెప్టో వ్యవస్థాపకుడు కైవల్య వొహ్రా (20) యువ బిలియనీర్. కాగా, ఫాల్గుని నాయర్‌ను వెనక్కినెట్టి స్వయం శక్తితో ఎదిగిన భారతీయ సంపన్న మహిళల్లో ప్రథమ స్థానంలో రాధా వెంబు నిలిచారు. 94 ఏండ్ల వయసులో ప్రెసిషన్ వైర్స్ ఇండియా సంస్థకు చెందిన మహేంద్ర రతిలాల్ మెహతా జాబితాలో స్థానం సంపాదించారు. రూ.3,000 కోట్ల సంపదతో ప్రైవేట్ ఈక్విటీ రంగం నుంచి హురున్ సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకున్న తొలి వ్యక్తిగా కేదార క్యాపిటల్‌కు చెందిన మనీశ్ కేజ్రీవాల్ నిలిచారు. నిరుడు జాబితాతో చూస్తే ఈసారి జాబితాలో బైజూస్ రవీంద్రన్ సహా 55 మంది చోటు కోల్పోయారు.

తెలంగాణ నుంచి 95 మంది

తెలంగాణ రాష్ట్రంలో శ్రీమంతులు అంతకంతకు పెరుగుతున్నారు. తాజాగా హురున్ విడుదల చేసిన జాబితాలో రాష్ట్రం నుంచి 95 మందికి చోటు లభించింది. వీరిలో ఒక్క హైదరాబాద్ నగరం నుంచే 87 మంది ఉండటం విశేషం. దివీస్ ల్యాబ్ అధినేత మురళీ దివీస్ తొలి స్థానంలో నిలిచారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి 10 మందికి చోటు లభించింది. మరోవైపు, సంపన్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానం దక్కింది.

66 వేల పైకి సూచీ

సెన్సెక్స్ 567, నిఫ్టీ 177 పాయింట్ల పెరుగుదల

ముంబై, అక్టోబర్ 10: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. ఆర్థిక, వాహన ,ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో సూచీలు ఒక్క శాతం వరకు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా మార్కెట్లను మరింత ముందుకు తీసుకెళ్లాయి. ప్రారంభం నుంచి లాభాలబాట పట్టిన సూచీలు చివరి వరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. మార్కెట్ ముగిసే సమయానికి 566.97 పాయింట్లు పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ మళ్లీ 66 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 66,079.36 పాయింట్ల వద్ద ముగిసింది. అటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 177.50 పాయింట్లు అందుకొని 19,689.85 వద్ద ముగిసింది. అమెరికా బాండ్ ఈల్డ్ తగ్గినప్పటికీ వడ్డీరేట్లు మరికొంతకాలం యథాతథంగా ఉండే అవకాశం ఉండటంతో మదుపరులు భారీగా నిధులు కుమ్మరించారు.

- భారతీ ఎయిర్‌టెల్, కొటక్ బ్యాంక్, టాటా మోటర్స్‌ల షేర్లు రెండు శాతానికి పైగా పెరిగాయి.
- వీటితోపాటు జేఎస్‌డబ్ల్యూ స్టీల్, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, మారుతి, టాటా స్టీల్, ఎస్బీఐ, హెచ్‌సీఎల్ టెక్నాలజీలు ఒక్కశాతంకు పైగా బలోపేతం అయ్యాయి.
- అలాగే పవర్‌గ్రిడ్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, నెస్లె, సన్‌ఫార్మా, హెచ్‌యూఎల్, ఎల్‌అండ్‌టీ, టైటాన్‌లు లాభపడ్డాయి.
- కానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్‌లు నష్టపోయాయి.
- బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 1.4 శాతం, బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 1.14 శాతం చొప్పున లాభపడ్డాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ అత్యధికంగా 4 శాతం లాభపడగా, మెటల్ 2.59 శాతం, టెలికం 2.24 శాతం, సేవలు 1.96 శాతం, కమోడిటీస్ 1.52 శాతం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు 1.24 శాతం, ఎనర్జీ 1.29 శాతం చొప్పున పెరిగాయి.

60 శాతం ఆర్డర్లు నాన్-మెట్రో నగరాల నుంచే!

ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: తమ బిగ్ బిలియన్ డేస్ సేల్ మొదటి రోజున 60 శాతం ఆర్డర్లు నాన్-మెట్రో నగరాల నుంచే వచ్చాయని డిజిటల్ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ మంగళవారం వెల్లడించింది. మొబైల్ ఫోన్లు, అప్లియెన్సెస్, లైఫ్ స్టైల్ ఉత్పత్తులను జోరుగా కొనుగోలు చేశారన్నది. తొలి రోజైన అక్టోబర్ 7నాటి సేల్స్ డాటాను కంపెనీ వెల్లడిస్తూ గత పండుగ సీజన్‌తో పోలిస్తే ఈ దఫా లైఫ్ స్టైల్ ఉత్పత్తులకు ఆర్డర్లు 10 రెట్లు పెరిగాయని, ఫర్నీచర్ అమ్మకాలు 8 రెట్లు, ఎలక్ట్రానిక్స్ 7 రెట్లు అధికమైనట్టు తెలిపింది. మొదటిరోజున 9.1 కోట్ల మంది కస్టమర్ విజిట్స్ జరిగాయన్నది. అక్టోబర్ 8న ఫ్లిప్‌కార్ట్ తన వీఐపీ కస్టమర్లకు 24 గంటలూ యాక్సెస్ కల్పించింది. పెయిడ్ సబ్‌స్క్రయిబర్లను, ఒక ఏడాదిలో కనీసం నాలుగు దఫాలు ప్లాట్‌ఫామ్‌పై షాప్ చేసిన ప్లస్ క్యాటగిరీ సబ్‌స్క్రయిబర్లను వీఐపీ కస్టమర్లుగా ఫ్లిప్‌కార్ట్ పరిగణిస్తున్నది. తమ షాపర్లలో అత్యధికంగా బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ నగరాల నుంచి విజిట్ చేశారని, అటుతర్వాత స్థానాల్లో ముంబై, పుణె, అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, గుర్‌గావ్‌లు ఉన్నాయి. మెట్రో, టైర్ 2 నగరాల నుంచి రూ.20,000 ధరకు పైబడిన స్మార్ట్‌ఫోన్లకు డిమాండ్ పెరిగిందని ఫ్లిప్‌కార్ట్ వివరించింది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఈజెడ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: దేశీయ మార్కెట్లోకి సరికొత్త మ్యాగ్నైట్ ఈజెడ్‌ని పరిచయం చేసింది నిస్సాన్ ఇండియా. ఈ కారు ప్రారంభ ధర రూ.6,49,900గా నిర్ణయించింది. వచ్చే నెల 10 వరకు మాత్రమే అమలులో ఉండనున్న ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఎస్‌యూవీ, సెడాన్, హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో తక్కువ ధర కలిగినది ఇదే మాడల్ కావడం విశేషం. ఈ నెల 10 నుంచి బుకింగ్‌లు ఆరంభించిన సంస్థ..ముందస్తుగా రూ.11 వేలు చెల్లించి బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ వర్గాలు విజ్ఞప్తి చేశాయి. 5 స్పీడ్ ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ కలిగిన మాడల్ 1.0 లీటర కెపాసిటీతో రూపొందించింది.